క్లుప్తంగా

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ల ఆవిష్కరణ



ఆత్మకూరు: జనవిజ్ఞాన వేదిక ఆత్మకూరు మండల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కే సురేష్ మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా ఈ నెల 18న పాఠశాల, నవంబరు 1న మండల, నవంబరు 23న జిల్లా, డిసెంబరు 12, 13, 14 తేదీల్లో రాష్ట్రస్థాయిలో విద్యార్థులకు టాలెంట్ టెస్టులను నిర్వహించనున్నట్లు తెలిపారు. జేవీవీ జిల్లా నాయకులు వంటేరు మల్లికార్జున, సీనియర్ నాయకులు ఎస్‌కే సందానీ, బడుగు శ్రీనివాసులు, సాధిక్ హుస్సేన్, నజీర్, సైన్స్ ఉపాధ్యాయినులు కవిత, కరుణ, తదితరులు పాల్గొన్నారు.

బాలుడికి ఆర్థిక సాయం



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 13వ వార్డుకు చెందిన తేజేష్‌కు వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకుడు, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ వింగ్స్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జే ప్రణీత్ గురువారం ఆర్థిక సాయం అందజేశారు. పేద కుటుంబానికి చెందిన తేజేష్ మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో వైద్యఖర్చులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మందులు సైతం అందజేస్తున్నట్లు డాక్టర్ ప్రణీత్ తెలిపారు. వైద్యులు వెంకట సందీప్, కుమార్, తోడేటి అశోక్, కొప్పోలు వెంకటేశ్వర్లు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచ్‌ల ఏర్పాటు



ఉదయగిరి రూరల్: గండిపాళెంలోని పాన్నెబోయిన చెంచురామయ్య జలాశయం ఆవరణంలోని సిద్ధేశ్వర, పరమేశ్వర, దత్తాత్రేయ, అభయాంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో సిమెంట్ బెంచ్‌లను ఏర్పాటు చేశారు. ఆలయాల నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు గ్రామానికి చెందిన దాతలు ముందుకొచ్చి వీటిని ఏర్పాటు చేశారు.

విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈగా చెంగయ్య



ఉదయగిరి రూరల్: మండల విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈగా చెంగయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. వరికుంటపాడులో సబ్‌ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఆయన ఉదయగిరిలో ఇన్‌చార్జి ఏఈగా నియమితులయ్యారు. ఇక్కడ ఇన్‌చార్జి ఏఈగా పనిచేస్తున్న ఖుద్దూస్‌బాషా వరికుంటపాడు ఏఈగా నియమితులయ్యారు.

సన్మానం



ఉదయగిరి రూరల్: మండల విద్యావనరుల కేంద్రంలో సీఆర్‌ఎంటీగా పనిచేసిన ఏ వెంకటేశ్వర్లును ఉదయగిరి, సీతారామపురం ఎంఈఓలు షేక్ మస్తాన్‌వలి, టీ శ్రీనివాసులు, టీ వెంకటేశ్వర్లు గురువారం ఘనంగా సన్మానించారు. డీఎస్సీ–2025లో స్కూల్ అసిస్టెంట్ పోస్టును సాధించడంపై అభినందించారు. సీఆర్‌ఎంటీగా అందించిన సేవలను కొనియాడారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేయాలి



కొండాపురం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలని ఎంపీడీఓ ఆదినారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన రాష్ట్రీయ పోషణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

19న అంకాలమ్మకు పొంగళ్లు

సీతారామపురం: స్థానిక బెస్తకాలనీ సమీపంలో కొలువైన గ్రామదేవత అంకాలమ్మ ఆలయం వద్ద సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. దసరా పండగ తరువాత గ్రామదేవతకు పొంగళ్లు పెట్టడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు.

చెలరేగిపోతున్న గ్రావెల్ మాఫియా

- అనుమతుల్లేకుండా మంచాలపల్లి తిప్పపై గ్రావెల్ తవ్వకాలు
- రాత్రి వేళల్లో జోరుగా అక్రమ రవాణా
- నిద్రమత్తులో రెవెన్యూ అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



తిప్పపై గ్రావెల్ తవ్వకాలు చేపట్టిన దృశ్యం

సోమశిల: అనంతసాగరం మండలంలో గ్రావెల్ మాఫియా చెలరేగిపోతోంది. తిప్పలు, ప్రభుత్వ, అటవీ భూముల్లో అనుమతుల్లేకుండా గ్రావెల్ తవ్వకాలు చేపడుతోంది. రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా గ్రావెల్‌ను తరలిస్తూ సొమ్ము చేసుకుంటోంది. ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో రావాల్సిన ఆదాయానికి గండి కొడుతోంది. గ్రావెల్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని మంచాలపల్లి సమీపంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం వెనుకవైపున ఉన్న తిప్పపై అక్రమార్కులు గత రెండ్రోజులుగా రాత్రి వేళల్లో గ్రావెల్ అక్రమంగా తవ్వకాలు చేపడుతున్నట్లుగా గ్రామస్తులు తెలిపారు. వర్షాలు పడుతుండడంతో ప్రభుత్వ, అటవీ భూముల్లో తవ్వకాలు చేపట్టడం కుదరకపోవడంతో తిప్పపై జేసీబీని ఉపయోగించి పెద్ద ఎత్తున ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌ను సుమారు రూ.1200 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల మండలంలో గ్రావెల్ అక్రమార్కుల ఫోన్‌కాల్ రికార్డింగ్ సోషల్ మీడియా ద్వారా లీకైంది. అందులో అధికారులకు మామూళ్లు ఇస్తున్న విషయం వెలుగులోకి వచ్చిన తెలిసిందే. సదరు రికార్డింగ్‌లో మాట్లాడిన వ్యక్తే అధికారులను లోబరుచుకుని ముడుపులు ఇస్తూ గ్రావెల్ అక్రమ తవ్వకాలు సాగిస్తూ సొమ్మును దోచుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తిప్ప నుంచి రెండ్రోజులుగా రాత్రి వేళల్లో పెద్ద ఎత్తున గ్రావెల్‌ను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మృతుల కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



మృతదేహాల వద్ద నివాళులర్పిస్తున్న పందిటి కామరాజ్

కలిగిరి: కుడుములదిన్నెపాడు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పందిటి కామరాజ్ కోరారు. తూర్పుదూబగుంట ఎస్సీ కాలనీకి చెందిన చవలమూడి బాబు, మమత దంపతులు, కుమార్తె వైభ రోడ్డు ప్రమాదంలో మరణించిన నేపథ్యంలో వారి మృతదేహాలను గురువారం ఆయన సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించడం, మరో చిన్నారి తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలవడం విషాదకరమన్నారు. ప్రభుత్వంతో పాటు ప్రమాదానికి కారణమైన బోర్‌వెల్స్ యజమానులు కూడా ఆర్థిక సాయం అందించి మృతుల కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. ఆస్పత్రిలో ఉన్న చిన్నారి మేఘనకు మెరుగైన చికిత్స అందించాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే మృతుల కుటుంబానికి పోలీసులు అందించిన సహాయ సహకారాలు అభినందనీయమన్నారు. బాధిత కుటుంబానికి తమ పార్టీ అండగా నిలుస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కూనిపోగు ఇర్మియా, ఎస్సీ సెల్ నాయకులు పరచు మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

తూర్పుదూబగుంట ఎస్సీ కాలనీకి చెందిన చవలమూడి బాబు, మమత, చిన్నారి వైభ మృతదేహాలను రావులకొల్లు సర్పంచ్ పూసల వెంగపనాయుడు గురువారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుల అంత్యక్రియల నిమిత్తం రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తన చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయాన్ని అందజేశారని సర్పంచ్ తెలిపారు. రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ద్వారా ఆదుకునేందుకు ఎమ్మెల్యే కాకర్ల అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. గాయపడిన చిన్నారి మేఘనకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. బోర్‌వెల్స్ ద్వారా బీమా నగదు అందించడానికి ప్రత్యేకంగా న్యాయవాదిని నియమిస్తున్నామని తెలిపారు.

సంగంలో భారీ వర్షం



సంగంలో కురుస్తున్న వర్షం



సంగంలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

సంగం: మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. రెండ్రోజుల క్రితం వరకు ఎండ వేడిమితో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బుధవారం సాయంత్రం నుంచి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఓ మోస్తరు వర్షం పడింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు విడతల వారీగా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. సంగంతో పాటు గ్రామాల్లోనూ పనులు చేసుకునేందుకు వీలుకాక ప్రజానీకం ఇబ్బంది పడ్డారు. సంగంలోని సిండికేట్ బ్యాంకు సమీపంలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండి రోడ్డుపై నీరు నిల్వ చేరడంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. దువ్వూరు, సిద్ధీపురం, అనసూయనగర్, జెండాదిబ్బ తదితర ప్రాంతాల్లోనూ రోడ్లు, పొలాల్లోకి వెళ్లే రహదారులపై నీరు చేరడంతో రైతులు అవస్థ పడ్డారు.

వరికుంటపాడు: మండలంలోని గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలంలోని అన్ని పంచాయతీల్లో కంది, మినుము, తదితర మెట్టపంటలతో పాటు వరి సాగుచేసి ఉన్నారు. ఈ పంటలకు వర్షం మేలు చేకూరుస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

కలిగిరి: కుడుములదిన్నెపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తూర్పుదూబగుంట ఎస్సీ కాలనీకి చెందిన చవలమూడి బాబు, దంపతులు, కుమార్తె మరణించడం బాధాకరమని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి బోర్‌వెల్స్ యాజమాన్యం, ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో తీవ్రంగాగాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి మేఘనకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని కోరారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు

ఉదయగిరి: మండలంలోని పుల్లాయపల్లె పంచాయతీ పరిధిలోని అన్నంపల్లె గ్రామానికి చెందిన ఎగిటిల శ్రీనివాసులు తన కుమారుడు వెంకట యోగేష్ కనిపించడం లేదని పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. వివరాలు..వెంకటయోగేష్ ఉదయగిరిలోని మేకపాటి వెంకురెడ్డి ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి కళాశాలకు వెళ్లాడు. రాత్రికి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించడంతో పాటు బంధువులు, స్నేహితులను విచారించారు. అయినా ఫలితం లేకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుకులంలో బాలికా దినోత్సవం




సంగం: స్థానిక గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బాలికల హక్కులు, లింగ వివక్ష, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గురుకులం ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, సీడీపీఓ సునీలత, సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పంచాయతీని విభజించొద్దని వినతి

ఉదయగిరి రూరల్: తిరుమలాపురం పంచాయతీని విభజించొద్దని ఆ పంచాయతీ పరిధిలోని దుంపవారిపల్లి, గుడినరవ, తిరుమలాపురం ఎస్టీ కాలనీకి చెందిన పలువురు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ బీ శ్రీనివాసులుకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పంచాయతీ పరిధిలో ఐదు గ్రామాలు ఉన్నాయన్నారు. తామంతా కలిసిమెలిసి ఉంటున్నామన్నారు. పంచాయతీ విభజనను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. తమకు విభజన అవసరం లేదన్నారు.

విద్యుత్‌లైన్‌కు మరమ్మతులు



సంగం: స్థానిక బ్రహ్మంగారి గుడివీధిలో విద్యుత్‌లైన్ తెగిపోయి ప్రమాదభరితంగా ఉండగా స్థానికులు గురువారం గమనించారు. ట్రాన్స్‌కో ఏఈ మన్మథరావు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేయించి మరమ్మతులు చేయించారు. వర్షాలు పడుతున్న క్రమంలో తీగ తెగిపోయి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని, అధికారులు స్పందించడంతో ముప్పు తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

జాతీయ నూనె గింజల పథకంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఓ విజయభాస్కర్

ఉదయగిరి రూరల్: మండలంలోని అప్పసముద్రం లోని రైతుసేవా కేంద్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జాతీయ నూనె గింజల పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూనె గింజల పంటల సాగును ప్రోత్సహించే లక్ష్యంతో జాతీయ నూనె గింజల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం కింద రైతులకు వేరుశనగ గింజలను నూరుశాతం సబ్సిడీపై అందజేస్తోందని తెలిపారు. అనంతరం వేరుశనగ పంటలోని వివిధ రకాలు, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలను వివరించారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలన్నారు. సాగుచేసిన పంటలను వీఏఏను కలిసి నమోదు చేసుకోవాలని కోరారు. ఈక్రాప్ నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సులభంగా అర్థమయ్యేలా బోధన చేపట్టాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

ఉదయగిరి: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధనోపకరణాలతో బోధన చేపట్టాలని ఎంఈఓ–1 టీ వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అసెస్మెంట్ బుక్‌లెట్లను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యార్థుల బుక్‌లెట్లను త్వరగా మూల్యాంకనం చేసి మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం రజియాబేగం ఉపాధ్యాయులు ఉన్నారు. అలాగే బీసీ కాలనీలోని తెలుగు ఆదర్శ పాఠశాలను ఎంఈఓ–2 శ్రీనివాసులు తనిఖీ చేశారు. హెచ్‌ఎం నవ్య పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ



ఉదయగిరి: కలెక్టర్ ఆదేశాల మేరకు కావలి రవాణా శాఖ ఆధ్వర్యంలో ఉదయగిరిలో జీఎస్టీపై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల వద్ద నుంచి పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు మండలాధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం జీఎస్టీ 2.0లో భాగంగా 99 రకాల వస్తువులపై జీఎస్టీని 28 నుంచి 18 శాతానికి తగ్గించిందని తెలిపారు. దీంతో పేద, మధ్య తరగతి వర్గాల వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. జీఎస్టీ ఉప సహాయ కమిషనర్ షేక్ షరీనా, ఎంవీఐ, సహాయ ఎంవీఐలు గోపి నాయక్, కరుణాకరణ్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎస్సై రఘునాథ్, సీడీపీఓ పుణ్యవతి, పీఆర్ ఏఈ శ్రీనివాసరాజు, డిప్యూటీ ఎంపీడీఓ కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

బస్సుల్లేక ప్రయాణికుల ఇక్కట్లు



ఉదయగిరి బస్టాండ్‌లో బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు



సీతారామపురం: బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

సీతారామపురం/ఉదయగిరి: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కర్నూలు పర్యటనకు ఆర్టీసీ బస్సులను తరలించడంతో ఉదయగిరి డిపో పరిధిలోని ప్రయాణికులు రెండో రోజు గురువారం కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మోదీ సభకు ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి 29 బస్సులను కేటాయించారు. అత్యధికంగా గ్రామీణ ప్రాంత సర్వీసులను రద్దు చేయడంతో వివిధ మార్గాల్లో బస్సులు లేక ప్రయాణికులు, విద్యార్థులు పడరాని పాట్లు పడ్డారు. పెళ్లిల్ల సీజన్ కావడంతో బస్టాండ్ సెంటర్లలో ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఓ వైపు వర్షం కురుస్తుండడంతో బస్సు షెల్టర్లలో నుంచి బయటకు రాలేక, వేచి ఉండలేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సభలకు జనసమీకరణకు బస్సులు కేటాయించి ప్రయాణికులను ఇబ్బందిపెట్టడం ఎంతవరకు సబబు అని పలువురు కూటమి ప్రభుత్వంపై పెదవి విరుస్తున్నారు.

సీజేఐపై దాడియత్నం దారుణం



న్యాయవాది దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఎస్పీ నాయకులు

ఆత్మకూరు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై కోర్టు ఆవరణలోనే న్యాయవాది దాడికి యత్నించడం దారుణమని బీఎస్పీ నాయకులు ఖండించారు. మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి టీ కృష్ణ, ప్రధాన కార్యదర్శి బీ శేషాద్రి ఆధ్వర్యంలో తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని ఖండిస్తూ న్యాయవాదిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం దాడికి పాల్పడిన న్యాయవాది దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నుపల్లి రామకృష్ణ, నారాయణమూర్తి, హజరత్తమ్మ, కృష్ణయ్య, పెంచలయ్య, రవీంద్ర, అంకులయ్య, జ్యోతి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలను ఆహారంగా అందించాలి



సంగంలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సునీలత



అనుమసముద్రంపేట: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శ్రీదేవి

అనుమసముద్రంపేట: అంగన్‌వాడీ చిన్నారులకు చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. మండలంలోని హసనాపురం, తెల్లపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో రాష్ట్రీయ పోషణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు అందించే ఆహారంలో ఉప్పు, చక్కెర, నూనెలు తక్కువగా ఉండేలా చూడాలన్నారు. పిజ్జాలు, కూల్‌డ్రింక్స్ వంటి హానికరమైనవి ఇవ్వవద్దని సూచించారు. చిన్నారులకు చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని అందిస్తే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పిల్లల ఆహారం విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు.

సంగం: స్థానిక తిరుమనతిప్ప అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రీయ పోషణ కార్యక్రమంలో సీడీపీఓ సునీలత పాల్గొన్నారు. చిన్నారుల్లో పోషకాహారం లోపంతో తలెత్తే సమస్యలు, చిన్నారులకు అందించాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జామాయిల్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం



మర్రిపాడు: మండలంలోని నందవరం వద్ద నెల్లూరు–ముంబయి జాతీయ రహదారి పక్కనున్న జామాయిల్ ఫ్యాక్టరీలో గురువారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న మర్రిపాడు అగ్నిమాపక అధికారి వెంకటేశ్వర్లు తన సిబ్బందితో అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. నష్టం వివరాలు తెలియరావాల్సి ఉంది. కాగా ఇదే ఫ్యాక్టరీలో రెండు నెలల క్రితం కూడా అగ్నిప్రమాదం చోటు చేసుకుంది.

ప్రత్యేక ఆధార్ కేంద్రంలో సేవలు ప్రారంభం



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని అరుంధతీయవాడ సచివాలయంలో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని కమిషనర్ సీ గంగాప్రసాద్ గురువారం ప్రారంభించారు. షెడ్యూల్డ్ కులాల వారి కోసం గురు, శుక్ర, శనివారాల్లో ఆధార్ సేవలను అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఆధార్ కార్డులు లేని, పొగొట్టు కున్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భజన బృందం పవిత్ర స్నానాలు



ఆత్మకూరురూరల్: మహిమలూరులోని పడమటివీధికి చెందిన భజన బృందం బండారుపల్లి వద్ద ఉన్న పెన్నానదిలో గంగమ్మకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. అనంతరం పవిత్ర స్నానాలు ఆచరించారు. నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి ఆలయం వద్ద ఇటీవల పండరి భజన నేర్చుకున్న భక్తులు ధ్వజారోహణం చేసి అగ్నిగుండం తొక్కేందుకు అంకురార్పణగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

వింజమూరు(ఉదయగిరి)/సీతారామపురం: దీపావళికి బాణసంచా విక్రయించే వారు తప్పనసరిగా అనుమతులు తీసుకోవాలని సీతారామపురం తహసీల్దార్ షేక్ ఫజియా, వింజమూరు ఎస్సై వీరప్రతాప్ తెలిపారు. గురువారం వారు తమ కార్యాలయాల్లో విలేకరులతో మాట్లాడారు. బాణసంచా విక్రయదారులు తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, విద్యుత్, పంచాయతీ అధికారుల అనుమతితో అధికారులు నిర్దేశించిన ప్రాంతాల్లో నిబంధనల మేరకు షాపులను ఏర్పాటు చేసుకుని బాణసంచా విక్రయించాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.